ఉ. మాయలమారి రీతిగను మమ్ము హరించి గమించినావు – నీ
హేయపువర్తనంబదియ యెంతటి శూరతయంచు నెంతువో
రాయల నీతిగాదిది ! పరాక్రమశాలికి బాటగాదు ! నీ
కాయము నీకు దక్కదిక కాచుకొనుమ్మిక యుద్ధభూమిలో !

మైరావ :—ఓరీ నరాధమా !

ఉ. దొంగవిధాన వాలితల ద్రుంచినవాడవు నీ ప్రతాపమే
కంగున మారు మోగినదిగట్టిగనీతుల నేర్పుచుంటివా ?
చెంగటనున్న దోషముల సిగ్గిసుమంతయు లేక నాకె దే !
దొంగకుగాని నేర్పడదు దొంగలచాతురి దొంగరాముడా !

ఉ. కోతులకేగదా మిము కూర్మి భజించుట చెల్లెనౌర ! వి
ఖ్యాతికి దూరమైన మిము గౌరవనీయులుగా తలంచుటల్
నీతికి నింపుమార్గములె ! నీ బలమెంతయొ – శౌర్యమెంతయో
నే తెలియంగలేననుచు నెంచితవే మొకొ వెఱ్ఱిరాముడా !

ఆంజ :—ఓరీ మైరావణా ! దూషణతిరస్కారములకు రణరంగములో తావులేదు.

శా. చేవల్గల్గిన నిల్చియుద్ధములలో జక్కాడు మా రావణా !
శౌర్యిన్గాంచగ నాసయుండెనను నేడీ బాటలన్ పీడుమా
చావో! యేదో జయంబొగాంచుచుననీసంస్తుత్యూతన్ బొందుమా
నీవే వీరుడవన్న మాటలను మానేయంగ నూహింపుమా !

మైరా :—అటులైన యుద్ధమునకు రమ్ము.

గీ. రండు రండిక భీషణభండనంబు
సలుపుచున్నాడు ఇపుడు రాక్షసవిభుండు !
రాముడేగాని – ఎవడైన – రంగమందు
నిల్చి గెల్చెద – తెలియరీ నేర్పుమీరు.

రాము :—రమ్ము మైరావణా ! నీ దర్పము తెలియగలదు !

